క్లుప్తంగా

భవన నిర్మాణ పనుల పరిశీలన



ఉదయగిరి: స్థానిక మేకపాటి రాజమోహన్‌రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరుగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను ఏపీఈ డబ్ల్యూఐడీసీడీ ఈఈ సుబ్బారావు, ఏఈఈ ప్రతాప్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఎం ఉష పథకం కింద కళాశాలకు రూ.5 కోట్ల నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అందులో రూ.3.50 కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. నిర్దేశించిన సమయంలోగా నిర్మాణ పనులను పూర్తిచేయాలని కాంట్రాక్టర్లు గడ్డం శ్రీనివాసులు, బొజ్జ శ్రీనివాసులుకు సూచించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎల్ నారాయణస్వామి, వైస్‌ప్రిన్సిపల్ నరసింహారెడ్డి, ఉన్నారు.

మర్యాదపూర్వకంగా..



సతీష్‌రెడ్డిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఆత్మకూరురూరల్: తన స్వగ్రామమైన మహిమలూరుకు శుక్రవారం వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ డాక్టర్ గుండ్రా సతీష్‌రెడ్డిని పలువురు గ్రామస్తులు, ఉపాధ్యాయులు, బ్యాంకు ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిశారు. మహిమలూరు–దేపూరు రోడ్డు పునరుద్ధరణ, సతీష్‌రెడ్డి చదువుకున్న వీఎస్ఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధి , బసవరాజుపాళెం నుంచి 67వ నంబరు జాతీయ రహదారిని కలిపే మట్టిరోడ్డును తారురోడ్డుగా మార్చడం, తదితర పనులపై ఆయనకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, త్వరలోనే మంజూరుకు కృషి చేస్తామని సతీష్‌రెడ్డి హామీ ఇచ్చారు. జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సోమవరపు భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు శివప్రసాద్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



సీతారామపురం: మండలంలోని పోకలవారిపల్లి ఎస్సీ కాలనీకి చెందిన కర్ర జీవయ్య కుటుంబానికి బాలాయపల్లి పంచాయతీకి చెందిన పలువురు శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల జీవయ్య కేన్సర్ మృతి చెందిన నేపథ్యంలో కుటుంబానికి చింతల శ్రీనివాసులు, దాసరి బ్రహ్మయ్య, చెన్నకేశవులు, ఎడమ తిరుపతయ్య, సాల్మన్ కలిసి రూ.19 వేలు నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు నేలటూరి జాషువా, జమ్మలమడుగు ఇజ్రాయేల్ పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



ఉదయగిరి రూరల్: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈఓ–1,2లు టీ వెంకటేశ్వర్లు, టీ శ్రీనివాసులు ఉపాధ్యాయులకు సూచించారు. గండిపాళెం ప్రాథమిక పాఠశాలను శుక్రవారం వారు తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు సులభంగా అర్థం చేసుకునేలా బోధనోపకరణాలతో బోధన చేయాలని సూచించారు. విద్యార్థుల్లో దాగిఉన్న సజనాత్మకతను వెలికితీయాలన్నారు. అనంతరం విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరీక్షించారు. హెచ్‌ఎం షాహీదా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి: ఉదయగిరి సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయ పరిధిలోని సంక్షేమ వసతి గృహాల్లో ప్రవేశానికి విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఏఎస్‌డబ్ల్యూఓ రమణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక సంక్షేమ శాఖ కార్యాలయ పరిధిలో ఏడు వసతి గృహాల్లో 700 మంది విద్యార్థులు చేరాల్సి ఉండగా, ఇప్పటి వరకు 399 మంది మాత్రమే ప్రవేశం పొందారని వివరించారు. మిగిలిన 301 ఖాళీల భర్తీకి మూడో తరగతి నుంచి పదోతరగతి వరకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను కోరుతున్నామన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు సమీప వసతి గృహాల వార్డెన్లను సంప్రదించాలని సూచించారు.

తల్లిపాలు అమృతంతో సమానం



ఉదయగిరి: అవగాహన కల్పిస్తున్న వింజమూరు సీడీపీఓ పద్మజాకుమారి



ఆత్మకూరులో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ సునీలత

ఆత్మకూరు: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పీ సునీలత అన్నారు. పట్టణంలోని సుందర్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్త పీ రాధమ్మ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో సీడీపీఓ మాట్లాడారు. తల్లి ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి పుష్కలంగా ఉంటుందన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టడం వల్ల వ్యాధులు దరిచేరవని తెలిపారు. అనంతరం యూపీహెచ్‌సీ డాక్టర్ ఎస్‌కే అస్మా బిడ్డకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. హెల్త్ సూపర్‌వైజర్లు సుధాకర్, పార్వతమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కస్తూరి, అంగన్‌వాడీలు సునీత, భవానీ, సుధారాణి, పద్మ, రమణమ్మ, సుప్రజ, దొరసాని, ఆశా కార్యకర్తలు వరలక్ష్మి, పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక శక్తి పుష్కలం

సోమశిల: అనంతసాగరం మండలం పాతదేవరాయపల్లి ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో అనంతసాగరం ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పద్మావతి పాల్గొన్నారు. తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. తల్లి ముర్రుపాలలో వ్యాధి నిరోధక శక్తి పుష్కలంగా ఉంటుందన్నారు. బిడ్డకు ఆరు నెలలు వచ్చే వరకు తల్లిపాలు పట్టడం వల్ల ఎదుగుదల బాగుంటుందన్నారు. వ్యాధులు దరిచేరవని తెలిపారు. అనంతసాగరం పీహెచ్‌సీ డాక్టర్ శ్రీకాంత్, సూపర్‌వైజర్ శారదమ్మ, అంగన్‌వాడీకార్యకర్త పెంచలమ్మ, ఏఎన్ఎం, ఆశావర్కర్ తదితరులు పాల్గొన్నారు.

బిడ్డకు శ్రేష్ఠం

ఉదయగిరి రూరల్: తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠమని ఉదయగిరి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి సునీత అన్నారు. మండలంలోని గుడినరవ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. బిడ్డకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. బిడ్డలకు డబ్బా పాలు ఇవ్వడం వల్ల ఆరోగ్యపరమైన సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ఆరు నెలల వరకు తల్లిపాలే పట్టాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కలిగిరి: కలిగిరిలోని ముస్లిం కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు. తల్లిపాల విశిష్టతపై అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన గంటలోపు తల్లి ముర్రుపాలు పట్టడం వల్ల వ్యాధులు దరిచేరవని తెలిపారు. అంగన్‌వాడీలు షర్మిళ, రాజేశ్వరి, పద్మాకుమారి, రాజేశ్వరి, లలితమ్మ, శాంతికుమారి, తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం: తల్లిపాలు బిడ్డకు ఎంతో మేలు చేకూరుస్తాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ షాను అన్నారు. పోలంగారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె మాట్లాడారు. తల్లి పాల ద్వారా బిడ్డకు అవసరమైన అన్ని రకాల పోషకాలు అందుతాయన్నారు. అంగన్‌వాడీలు సులోచన, సంపూర్ణ, మహిళా పోలీసు అశ్విని, తదితరులు పాల్గొన్నారు.

కావలి (జలదంకి): తల్లిపాలు అమృతంతో సమానమని కావలి డివిజన్ లింగ నిర్ధారణ నిషేధ కమిటీ సభ్యుడు ఎం మాలకొండారెడ్డి అన్నారు. పట్టణంలోని బాలకృష్ణారెడ్డినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. బిడ్డకు తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి మాట్లాడుతూ తల్లులు పోషకాహారాన్ని తీసుకుని బిడ్డలకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం పండ్లు, ఆకుకూరలు తదితరాలను ప్రదర్శించారు. అంగన్‌వాడీలు కామేశ్వరి, అనిత, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను వింజమూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ పద్మజాకుమారి శుక్రవారం ప్రారంభించారు. ఈ నెల 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తల్లిపాల సంస్కృతికి అధిక ప్రాధాన్యం ఇస్తూ తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లుగా చెప్పారు. తల్లిపాలు బిడ్డకు చాలా శ్రేష్ఠమని, బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు ముర్రుపాలు తాగించాలన్నారు. బిడ్డకు ఆర్నెళ్లు వచ్చేవరకు తల్లిపాలు పట్టడం ద్వారా తల్లులు రొమ్ము కేన్సర్ నుంచి బయటపడొచ్చని తెలిపారు. పిల్లల్లో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందన్నారు. సర్పంచ్ రొడ్డా వెంగమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజరు షకీల, అంగన్‌వాడీలు విజయలక్ష్మి, రాధ, సుజాత, చెన్నమ్మ, సుబ్బరత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.



సోమశిల: అనంతసాగరంలో..



కావలిలోని బాలకృష్ణారెడ్డినగర్‌లో..



సీతారామపురం మండలం పోలంగారిపల్లిలో..



కలిగిరి: ముస్లింకాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో..

కిలో పొగాకు సగటు ధర రూ.225

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకు సగటు ధర రూ. 225.61 పలికింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 528 బేళ్లను తీసుకురాగా, 269 బేళ్లను కొనుగోలు చేసినట్లు వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.160, సగటున రూ.225.61 ధర లభించిందని వివరించారు. వేలంలో 19 కంపెనీలు పాల్గొన్నాయని తెలిపారు.

డీసీపల్లిలో 215 బేళ్ల విక్రయం

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం 215 బేళ్లను విక్రయించినట్లు వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలానికి 450 బేళ్లు రాగా, 215 బేళ్లను విక్రయించామని చెప్పారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.280, కనిష్టంగా రూ.159, సగటున రూ.205.07 ధర పలికిందని వరించారు. వేలంలో పది కంపెనీల వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారని తెలిపారు.

స్కూటీని ఢీకొన్న కారు

- ఇద్దరు సచివాలయ ఉద్యోగులకు తీవ్రగాయాలు

జలదంకి: మండలంలోని జమ్మలపాళెం ఎస్వీఆర్ కల్యాణ మండపం ఎదురుగా గురువారం రాత్రి స్కూటీని ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ఇద్దరు సచివాలయ ఉద్యోగులు తీవ్ర గాయాలపాలయ్యారు. వివరాలు..జమ్మలపాళేనికి చెందిన మహేష్, నవ్య సచివాలయ ఉద్యోగులు. గురువారం రాత్రి స్కూటీపై కావలిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో జమ్మలపాళెం ఎస్వీఆర్ కల్యాణ మండపం వద్ద స్కూటీని జలదంకి నుంచి కావలి వైపును వెళ్తున్న కారు ఎదురుగా ఢీకొంది. ఈ ప్రమాదంలో సచివాలయ ఉద్యోగులైన మహేష్, నవ్యకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో చికిత్స నిమిత్తం కావలికి తరలించారు. నవ్య పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరుకు తరలించారు. జలదంకి ఎస్సై లతీపున్నీసా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కావలిలో అరాచక పాలన

- మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



పిచ్చయ్యను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి

అల్లూరు: కావలి నియోజకవర్గంలో ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి అరాచక పాలనను సాగిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. మండలంలోని ఇస్కపల్లి పంచాయతీ శంభునిపాళెం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త పుచ్చలపల్లి పిచ్చయ్యను అదే గ్రామానికి చెందిన కొందరు ఇబ్బందులకు గురిచేస్తున్న నేపథ్యంలో శుక్రవారం రామిరెడ్డి పరామర్శించారు. అక్కడి కాపులు, పిచ్చయ్య కుటుంబాన్ని పిలిచి సమస్యను శాంతియుతంగా, సామరస్యంగా పరిష్కరించారు. మత్స్యకార గ్రామాలు ప్రశాంతంగా ఉండాలని, ఎన్నికలప్పుడే రాజకీయాలని, ఆ తరువాత గ్రామాలు ప్రశాంతంగా ఉండాలన్నదే వైఎస్సార్‌సీపీ ధ్యేయమన్నారు. తాను వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. కావలిని కాపు కాయడం అంటే క్యాసినోలు, రికార్డింగ్ డ్యాన్సులు, పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలను పోత్సహించడమా అని ఎమ్మెల్యే కృష్ణారెడ్డిపై ధ్వజమెత్తారు. అల్లూరు రాజుపాళెం– ఇస్కపల్లి రోడ్డును తమ ప్రభుత్వ హయాంలో మంజూరు చేయడం జరిగిందన్నారు. కొంత మేర రోడ్డును కూడా వేయడం జరిగిందన్నారు. ఆ తరువాత ఎన్నికలు రావడంతో రోడ్డు పనులు నిలిచిపోయాయని తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే రోడ్డును నిర్మాస్తానని ఎన్నికల సమయంలో హామీఇచ్చారని, అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా వేయలేదన్నారు. ప్రస్తుతం రోడ్డు అధ్వానంగా తయారైందన్నారు. అభివృద్ధి తన మార్క్ అని, కావలిని కాపు కాస్తానని పలికే ఎమ్మెల్యే అసాంఘిక కార్యక్రమాలను పోత్సహించడం తప్ప చేసిందేమీ లేదన్నారు. ఇప్పటికైనా అభివృద్ధిపై దృష్టి సారించి రాజుపాళెం–ఇస్కపల్లి రోడ్డును పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.

కోవూరులో వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై దాడికి యత్నించడం హేయం

కోవూరులో వైఎస్సార్‌సీపీ కార్యాలయంపై కూటమి నాయకులు దాడికి యత్నించడం హేయమని రామిరెడ్డి ఖండించారు. జగనన్న పర్యటన విజయవంతం కావడంపై పార్టీ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపేందుకు కోవూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నాయకులు మీడియా సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రసన్న హాజరవుతున్నారని తెలుసుకుని కొందరు కూటమి నాయకులు మహిళలతో కలిసి దాడికియత్నించారన్నారు. ప్రసన్నపై కావాలని ప్రస్తుత ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారన్నారు. రాజకీయాల్లో ఇది మంచి పద్ధతి కాదన్నారు. రామిరెడ్డి వెంట వైఎస్సార్ సీపీ నాయకులు నీలం సాయికుమార్, బీద రమేష్‌బాబు, ఉస్మాన్, మధురెడ్డి, తాండ్ర మల్లి, కొండూరు శ్రీను, కరుణాకర్, బీద మహీధర్, తంబి వాసు, తదితరులు ఉన్నారు.

మద్యం మత్తులో ఘర్షణ



గాయపడిన మాధవ, మురళి

వింజమూరు(ఉదయగిరి): మద్యం మత్తులో ఇద్దరి వ్యక్తుల మధ్యన మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. ఈ క్రమంలో బీరుబాటిళ్లతో దాడి చేసుకోవడంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన వింజమూరు మండలం చాకలికొండలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలు.. చాకలికొండ గ్రామానికి చెందిన సీహెచ్ మాధవ మధ్యాహ్నం గ్రామ సమీపంలోని క్రీడామైదానం వద్దకు వెళ్లాడు. అక్కడ బత్తినవారిపల్లికి చెందిన కాకర్ల మురళి మద్యం సేవిస్తున్నాడు. అంతకుముందే మాధవ కూడా మద్యం సేవించి ఉన్నాడు. స్థానికులు ఇద్దరిని వింజమూరు సీహెచ్‌సీకి తరలించి చికిత్స చేయించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు



ఉదయగిరి రూరల్: పట్టణంలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తప్పవని సీఐ ఎస్ వెంకట్రావు హెచ్చరించారు. శుక్రవారం ఆయన తన సిబ్బందితో కలిసి పంచాయతీ బస్టాండ్ సెంటర్‌ను పరిశీలించారు. అడ్డదిడ్డంగా పార్కింగ్ చేసిన వాహనాలను గుర్తించి జరిమానా విధించారు. అలాగే పండ్లు, కూరగాయలు, కిరాణా దుకాణదారులు రోడ్డు మార్జిన్‌ను ఆక్రమించి ఏర్పాటు చేసిన సామగ్రిని తొలగించేలా చర్యలు చేపట్టారు. వాహనదారులు ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా వాహనాలను పార్కింగ్ చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. ఆయన వెంట ఎస్సై ఏ శ్రీను, సిబ్బంది ఉన్నారు.

ఫ్యాప్టో ధర్నా జయప్రదానికి పిలుపు



సంగం: మర్రిపాడులో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు



మురగళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సంగం: ఉపాధ్యాయ సమస్య పరిష్కారాన్ని నెల్లూరులో ఫ్యాప్టో ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్న ధర్నాను జయప్రదం చేయాలని సంగం మండలం మర్రిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు పిలుపునిచ్చారు. ప్రభుత్వ పాఠశాలల స్కూల్ అసిస్టెంట్లను ఎంఈఓలుగా నియమిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం మధ్యాహ్నం భోజన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూనియర్లు అయిన స్కూల్ అసిస్టెంట్లను ఎంఈఓలుగా కామన్ సర్వీస్ రూల్స్‌కు విరుద్ధంగా నియమించారన్నారు. ఏడాది క్రితం ఎయిడెడ్ స్కూళ్లను మూసివేసినప్పుడు యాజమాన్యాలు వారి ఆస్తులను ప్రభుత్వానికి ఇస్తే వాటిని ప్రభుత్వ పాఠశాలలుగా గుర్తించి వాటిల్లో ఉండే ప్రధానోపాధ్యాయులను ఎంఈఓ–1గా ఎఫ్ఏసీలుగా నియమించడం జరిగిందన్నారు. ఇటువంటి అసంబద్ధమైన నిర్ణయాలతో సీనియర్లు అయిన పంచాయతీరాజ్ ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారుల ఆత్మగౌరవం దెబ్బతింటుందన్నారు. ఇందుకు నిరసనగా ఫ్యాప్టో ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ధర్నాలో చేపడుతున్నట్లుగా తెలిపారు.

ఉపాధ్యాయుల నిరసన

ఆత్మకూరురూరల్: ప్రభుత్వ పాఠశాలల స్కూల్ అసిస్టెంట్లను ఎంఈఓలుగా నియమిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మురగళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి పెన్‌డౌన్, చాక్‌డౌన్ చేపట్టారు.

ఆదర్శ పాఠశాల సందర్శన



విద్యార్థులతో ముచ్చటిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు రమేష్

కలిగిరి: స్థానిక ఆదర్శ పాఠశాలను పీఎం శ్రీ పథకం రాష్ట్ర పరిశీలకుడు పీ రమేష్ శుక్రవారం సందర్శించారు. పీఎంశ్రీకి ఆదర్శ పాఠశాల ఎంపికైన నేపథ్యంలో వసతులను పరిశీలించారు. ల్యాబ్‌లు, లైబ్రెరీ, క్రీడామైదానం, మరుగుదొడ్లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో పలు విషయాలు చర్చించారు. ఆయన వెంట ప్రిన్సిపల్ అన్నవరం శ్రీను ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం పూజలు



ఉదయగిరిలోని సంతానలక్ష్మి ఆలయంలో కుంకుమార్చన చేస్తున్న భక్తులు

ఉదయగిరి: మండలంలోని ఆలయాల్లో శ్రావణ శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయగిరిలోని సంతానలక్ష్మి, పార్వతీ పరమేశ్వర ఆలయాలు, గండిపాళెంలోని మంగమ్మ ఆలయం, చౌటపల్లిలోని మహాలక్ష్మమ్మ ఆలయాల్లో అమ్మవార్లకు విశేషాభిషేకాలు, పూజలు, అలంకరణలు నిర్వహించారు. మహిళలు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నాగార్పమ్మ ఆలయంలో చోరీ

కావలి (జలదంకి): కావలిలోని వైకుంఠపురం పెంకులఫ్యాక్టరీ రోడ్డులోని నాగారప్పమ్మ ఆలయంలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. వివరాలు..నాగార్పమ్మ ఆలయానికి చుట్టూ గ్రిల్స్ మాత్రమే ఉన్నాయి. ఆలయ అర్చకురాలు చెన్నమ్మ గురువారం రాత్రి 8 గంటలకు గ్రిల్ తాళాలు వేసుకుని వెళ్లింది. శుక్రవారం ఉదయం వచ్చి గ్రిల్స్ తెరిచి చూడగా నాగార్పమ్మ మెడలోని బంగారు తాళిబొట్టు కనిపించలేదు. తాళిబొట్టుకు చెందిన చిన్నముక్క పక్కన పడి ఉంది. వెంటనే ఆమె ఆలయ కమిటీ సభ్యుడు నాగయ్యకు సమాచారం అందజేయగా ఆయన రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి పాల్పడిన వారు తాళాలు పగులగొట్టకుండా పొడవాటి కర్ర సాయంతో అమ్మవారి మెడలోని తాళిబొట్టును చోరీ చేసినట్లుగా పోలీసులు గుర్తించారు. ఈ మేరకు రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు అన్నదాత సుఖీభవ నిధులు జమ

ఉదయగిరి: ఉదయగిరి వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలో అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత సాధించిన రైతుల ఖాతాల్లో శనివారం నగదు జమవుతుందని ఏడీఏ లక్ష్మీమాధవి శుక్రవారం ఒక ప్రకటన తెలిపారు. సబ్‌డివిజన్ పరిధిలోని ఉదయగిరి మండలంలో 4,850, సీతారామపురంలో 2,958, దుత్తలూరులో 4,544, వరికుంటపాడులో 5,542, మంది రైతులు అర్హత సాధించారని వివరించారు.

579 మందికి ఉద్యోగావకాశాలు

ఆత్మకూరు: పట్టణంలోని ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రారంభమైన మెగా జాబ్‌మేళాలలో తొలి రోజు వివిధ కంపెనీల ద్వారా 579 మందికి ఉద్యోగావకాశాలు లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రముఖ కంపెనీలను తీసుకురావడంలో విశేష కృషి చేసిన కోఆర్డినేటర్లు కన్నన్, శ్రీనివాసన్‌ను మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు గుండ్రా సతీష్‌రెడ్డి అభినందించారు. ఉద్యోగావకాశాలు అందుకున్న అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు.

బంగారు చీర అలంకరణలో వాసవీమాత



ఆత్మకూరు: శ్రావణమాసం రెండో శుక్రవారాన్ని పురస్కరించుకుని పట్టణంలోని కన్యకాపరమేశ్వరి, పంటవీధి రామాలయంలోని పార్వతి అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. వివిధ రకాల ద్రవ్యాలతో కన్యకాపరమేశ్వరికి అభిషేకం నిర్వహించారు. బంగారు చీరను అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు సామూహికంగా లలితా సహస్రనామ పారాయణం చేశారు. ఉభయకర్తలుగా దోర్నాదుల సురేష్, సుజన దంపతులు వ్యవహరించారు.

వీధి దీపాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి జాతీయ రహదారి నుంచి వెళ్లే మార్గంలో వీధిదీపాలు లేకపోవడంతో సిబ్బందితో పాటు రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో రాత్రివేళల్లో విషసర్పాల సంచారం ఎక్కువగా ఉంటుంది. వీధిదీపాలు లేకపోవడంతో విషసర్పాల కాటుకు గురయ్యే ప్రమాదం పొంచి ఉందని రోగులు, వైద్య సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ పాలకులు స్పందించి వీధిదీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు చర్యలు

సీతారామపురం : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగునకు పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలని జెడ్పీ సీఈఓ మోహన్‌రావు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని గుండుపల్లి ఎస్సీ కాలనీలో పర్యటించారు. ఇంటింటి చెత్త సేకరణను పరిశీలించారు. మౌలిక సదుపాయాల కల్పనపై ఆరా తీశారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యం, వీధిదీపాల నిర్వహణపై పంచాయతీ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎంపీడీఓ సాయిప్రసాద్, ఈఓపీఆర్డీ రామ్‌నాథ్‌రెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.